
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శనివారం 6 జనవరి 2024 | 5



ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో...

7న అమలాపురంలో ముత్యాల ముగ్గుల పోటీలు

అమలాపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నల్లవంతెన దిగువున కలెక్టర్ కార్యాలయం పక్కన గల జీఎంసీ బాలయోగి స్టేడియంలో "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" ఈ నెల 7వ తేదీ ఆదివారం జరగనున్నాయి. జిల్లా పోటీలకు స్పాన్సరర్‌గా అమలాపురానికి చెందిన టీడీపీ అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జి జీఎం హరీష్ బాలయోగి వ్యవహరిస్తున్నారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ముత్యాల ముగ్గుల పోటీలు ప్రారంభమవుతాయి. జిల్లా నలుమూలల నుంచి మహిళలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. విజేతలైన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలవారికి రూ.6వేలు, రూ.4వేలు, రూ.3వేలు చొప్పున నగదు బహుమతులు ఉంటాయి. పోటీల్లో పాల్గొనే మహిళలు పేర్ల నమోదుకు 99854 11256, 99854 11015 నెంబర్లను సంప్రదించగలరు.

తెలుగు వైభవం!

యానాంలో నేటి నుంచి ఫల, పుష్ప ప్రదర్శన, ప్రజా ఉత్సవాలు ... 7లో







సభలో మాట్లాడుతున్న బీజేపీ నేత రామ్‌మాధవ్, వేదికపై గవర్నర్ బిశ్వభూషణ్, స్వరూపానందేంద్ర, యార్లగడ్డ, చైతన్యరాజు తదితరులు.. సభలో ప్రదర్శిస్తున్న నృత్యరూపకం

- అట్టహాసంగా ప్రారంభమైన 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలు
- హాజరైన చత్తీస్‌గఢ్ గవర్నర్ బిశ్వభూషణ్
- మహాసభలను ప్రారంభించిన స్వరూపానందేంద్ర
- 10 వేల మంది విద్యార్థులతో వేమన శతక ఆలాపన
- తొలిరోజు కవి సమ్మేళనం, భాషా ప్రక్రియలపై సదస్సు
- పలువురికి పూర్ణ కుంభ పురస్కారాలు

రాజానగరం/దివాన్‌చెరువు, జనవరి 5: ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలు గైట్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శ్రీరాజరాజ నరేంద్రుల పట్టాభిషేక సహస్రాబ్ది నీరాజనంగా, నన్నయ భట్టారకుని మహాభారతం వెయ్యేళ్లను పురస్కరించుకుని తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నారు. రాజరాజనరేంద్ర, నన్నయ భట్టారక, నారాయణ భట్టు వేదికలపై నందడిగా తెలుగుదనం ఉట్టిపడేలా వివిధ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. చైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపకుడు కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అధ్యక్షత వహించిన ప్రధాన వేదిక శ్రీరాజరాజ నరేంద్ర వేదిక నుంచి విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి తెలుగు మహాసభలను లాంచనంగా ప్రారంభించారు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, చత్తీస్‌గఢ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, ఆర్ఎస్ఎస్ జాతీయ కార్యదర్శి వారణాసి రామ్‌మాధవ్, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, విశ్వనాథ గోపాలకృష్ణ, పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, వీసీ ప్రసాదరాజు, ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి, పారిశ్రామికవేత్త వర్మ, అష్టావధాని బులుసు అపర్ణ మాట్లాడారు.

తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటాలి : బిశ్వభూషణ్

శ్రీకృష్ణ భగవానుడు గీతలో బోధించిన యదా యదా హి ధర్మస్య.. అంటూ మహా భారతాన్ని ఆదికవి నన్నయ తెలుగున అనువదించడాన్ని ప్రస్తావిస్తూ తెలుగుభాష విశిష్టత, ఔన్నత్యాన్ని చాటిచెప్పేలా ఇటువంటి సదస్సులు నిర్వహించడంపై చత్తీస్‌గఢ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ నిర్వాహకులను అభినందించారు. సాహిత్య, సాంస్కృతిక కళలకు నిలయంగా శోభిల్లుతున్న గోదావరి తీరాన తెలుగు మహాసభలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. గోదావరినది అన్నా, రాజమహేంద్రవరం అన్నా తనకు ఎంతో అభిమానమన్నారు. ముందుగా విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిస్వామి మాట్లాడుతూ తెలుగు భాషలాంటి భాష ఈ సృష్టిలో లేదన్నారు. ప్రపంచంలో ఎన్ని భాషలు ఉన్నప్పటికీ తెలుగు భాష మాధుర్యం, గొప్పతనం మరే భాషకు సాటిరాదని, తెలుగు భాషకు పూర్వ వైభవం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. సంస్కృతం కన్నా తెలుగులోనే ఎక్కువ అక్షరాలు ఉన్నాయన్నారు. బీజేపీ జాతీయ నేత రామ్‌మాధవ్ మాట్లాడుతూ తెలుగు భాషకు 2500 ఏళ్ల చరిత్ర, 1700 ఏళ్ల సాహిత్య చరిత్ర ఉందన్నారు. మన సంస్కృత భాషను మృతభాష అని ఆంగ్లేయులు వర్ణించారని, భాషలు బలహీనపడతాయేగానీ మరణించవన్నారు. వాటిని జీవింపజేసే ప్రయత్నం కింది స్థాయి నుంచి జరగాల్సి ఉందన్నారు. పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ తెలుగునేలను సస్యశ్యామలం చేసిన సర్‌ఆర్థర్ కాటన్, తెలుగు నిఘంటువు రూపొందించిన సీపీ బ్రౌన్, అలాగే గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం ప్రాతఃస్మరణీయులన్నారు. తెలుగు వారి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన నందమూరి తారకరామారావు, రాజ్యసభలో ఎవరి మాతృభాషలో వారు మాట్లాడే వీలు కల్పించిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడులను గుర్తు పెట్టుకోవాలన్నారు. మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ మాట్లాడుతూ చదువుకన్నా సంస్కారం ప్రధానమైందని, తెలుగుభాష నేర్చుకుంటే సంస్కారం అలవడుతుందన్నారు. అ అంటే అమ్మ అని, ఆ అంటే ఆవు అని నేర్చుకున్న మాటలను గుర్తుచేస్తూ అమ్మ ప్రేమకు సంకేతమైతే, ఆవు త్యాగానికి సూచికగా చెప్పారు. తెలుగు నేర్చుకుంటే సంస్కారం అలవడుతుందన్నారు. మాతృభాషపై అభిమానం ఉండాలన్నారు. మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు మాట్లాడుతూ తల్లిలాంటి తెలుగు భాషను మరువకూడదన్నారు. మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ తమిళ ప్రాంత పాలనలో ఉన్న యానాం నుంచి ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రాతినిధ్యం వహించిన తాను అసెంబ్లీలో తెలుగులోనే మాట్లాడేవాడినని గుర్తుచేశారు. ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ గౌతంరెడ్డి మాట్లాడుతూ తెలుగు భాషను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. అంతర్గత భావాలను వ్యక్తపరచడానికి మాతృభాష దోహదం పడుతుందన్నారు. జేఎన్టీయూ వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ తెలుగు మహాసభల నిర్వహణతో తెలుగుపై అందరికీ మమ కారం ఏర్పడుతుందన్నారు. చైతన్య విద్యా సంస్థల చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు మాట్లాడుతూ ఈ మహాసభల నిర్వహణతో సరిపెట్టుకోకుండా తెలుగు భాష ఉన్నతికి తమ కుటుంబం తరఫున ట్రస్ట్ ఏర్పాటు చేసే యోచన ఉందన్నారు. గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు భాషలోని మాధుర్యాన్ని అందరూ ఆస్వాదించి, ప్రతి ఒక్కరూ తెలుగు భాష నేర్చుకోవాలన్నారు. తెలుగు భాషపై పట్టు సాధిస్తే ఇతర భాషలపై కూడా పట్టువస్తుందన్నారు. తాను 121 భాషల్లో గజల్స్ పాడానని చెబుతూ ఆయా భాషల వాళ్లు ఆ గజల్స్‌ను ఎంత ఆనందించారో చెప్పనలవికాదన్నారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త రవివర్మ, ఆంధ్రసారస్వత పరిషత్ ముఖ్య సలహాదారులు కె.రామ్‌ప్రసాద్, శతావధాని కడిమెళ్ల వరప్రసాద్, రెడ్డప్ప ధవేజీ, కోట్ల కనకేశ్వరరావు, మంతెన కేశవరాజు, వేటుకూరి సూర్యనారాయణరాజు, తెలుగు మహాసభల సమన్వయకర్త సునంద రమేష్, అపుస్మా అధ్యక్షుడు సంకవల్లి మురళి, పలువురు కవులు, రచయితలు, భాషాభిమానులు పాల్గొన్నారు.

కవి సమ్మేళనం, భాషా ప్రక్రియపై సదస్సు

నారాయణభట్టు వేదికపై ఏర్పాటుచేసిన కవి సమ్మేళన అంకురార్పణ సభలో మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తెలుగు వైభవ కీర్తి అందరూ ఆనందించదగినదన్నారు. కవులు, రచనలు చేసేవారు వీరేశలింగం పంతులును స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. పొరుగు రాష్ట్రాల వారు భాషను కాపాడుకోవడానికి చేస్తున్న ఉద్యమాలను వివరించారు. కవులు తమ కవితలు ద్వారా జాతిని జాగృతం చేస్తూ తెలుగు భాషను నిలబెట్టుకోవాలని సూచించారు. ఆది కవి నన్నయ వేదికపై ఏర్పాటుచేసిన సదస్సుల అంకురార్పణ సభలో ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రవచనాలు, కావ్యాలు, పద్యాలు నేర్పించాలన్నారు. సంసారంలో సమస్యలకు సాహిత్యంతో పరిష్కారం లభిస్తుందని ప్రవచించారు. ప్రతిభావంతులను ఎవరూ అడ్డుకోలేరన్నారు. తిరుపతి వేంకట కవులు, చెళ్లపిళ్ల కవుల్లో దాగిన ప్రతిభకు ఎవరూ సాటిరారని చెప్పారు.



ఎంపీ, సినీ రచయిత విజయేంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

టీడీపీ, జనసేన పొత్తు నేపథ్యంలో సీట్ల సర్దుబాటు వ్యవహారం ఉత్కంఠ రేపుతోంది. ఏ ఇద్దరు కలిసినా ఈ అంశంపైనే మాట్లాడుకుంటున్నారు. ఆ సీటు ఈ పార్టీకి ఇస్తారు. ఈ సీటు ఆ పార్టీకి ఇస్తారంటూ మొదలయ్యే మాటలు వాగ్వివాదానికి దారితీసి వారి మధ్య యుద్ధానికి కారణమవుతోంది. సీట్ల సర్దుబాటు, ఏ నియోజకవర్గం ఏ పార్టీకి ఇస్తారు అనే అంశం ఇరు పార్టీల నేతల్లో నరాలు తెంపుతున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని ఒక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో సీట్ల అంశం రాజకీయంగా కాక రేపుతోంది.



'సీట్ల సర్దుబాటు'పై ఉత్కంఠ!

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

- టీడీపీ-జనసేన పొత్తు అంశంపై కేడర్‌లో చర్చలే చర్చలు
- స్థానాల ఎంపిక.. అభ్యర్థుల ప్రకటనపై తర్జనభర్జన
- కొత్త నేతల చేరికతో.. పాతవారికి గుబులు
- పార్టీ ప్రచారాస్త్రాలతో ప్రజల్లోకి టీడీపీ, జనసేన ఇన్‌చార్జిలు

జిల్లాలో ప్రధాన ప్రతిపక్షాలుగా ఉన్న టీడీపీ, జనసేన పొత్తు నేపథ్యంలో టిక్కెట్ల ఎంపిక జటిలమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. అటు టీడీపీ, ఇటు జనసేన ఆశావహులు, గతంలో టీడీపీ నుంచి ప్రాతినిధ్యం వహించి ఓటమి చెందిన ప్రస్తుత నియోజకవర్గ ఇన్‌చార్జిలు ఎవరి వ్యూహాల్లో వారు ఉన్నారు. మరోవైపు పార్టీ అధినాయకత్వాలు పొత్తులపై చర్చలు కొనసాగిస్తుండగానే నియోజకవర్గాల్లో ఆయా పార్టీల ఇన్‌చార్జిలుగా ఉన్న కొందరు అత్యుత్సాహంతో ముందడుగు వేస్తున్న తీరు వివాదమవుతోంది. కొన్ని నియోజకవర్గాల్లో జనసేన ఇన్‌చార్జిలు పార్టీ అధిష్ఠానంతో సంబంధం లేకుండా తమ వెంట ఉండే అనుచరగణాలతో మహా సంకల్ప యాత్ర పేరుతో ప్రజల్లోకి వెళ్తున్నారు. ఓటర్లతో పాద పూజలు, పాలాభిషేకాలు చేయించుకుంటూ విజయీభవ దీవెనలతో సోషల్ మీడియాలో జనసేనలోని కొందరు ఆశావహులు ప్రచారం చేస్తున్న తీరు పొత్తులో ఉన్న టీడీపీ ఆశావహులకు ఆందోళన కలిగిస్తోంది. దాంతో కొన్ని నియోజకవర్గాల్లో టీడీపీ ఇన్‌చార్జిలు కూడా పార్టీ ప్రణాళికలను ఏదో రూపంలో ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. రెండు కేడర్ల మధ్య గందరగోళం నెలకొనడంతోపాటు పరోక్ష 'వార్'కు దారితీస్తున్న పరిణామాలు కోనసీమలోని అమలాపురం, కొత్తపేట సహా మరికొన్ని నియోజకవర్గాల్లో వున్నాయి.

టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, ప్రధాన కార్యదర్శి లోకేశ్, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఉమ్మడి జిల్లా కేంద్రంగా ఎన్నికల వ్యూహ రచన చేస్తున్నారు. పొత్తులు, సీట్ల కేటాయింపులపై సంప్రదింపులు జరుపుతూ కొత్త సంవత్సరంలో ఇరుపక్షాల కేడర్‌కు శుభ సంకేతాలు అందించే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. అయితే ఇటీవల అనేక మంది ఆశావహులు అటు టీడీపీలోను, ఇటు జనసేనలోను చేరారు. మరికొందరు చేరేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ఆయా పార్టీల అగ్ర నాయకత్వాల నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చిన తర్వాతే తీర్థం తీసుకునేందుకు కొందరు వేచి చూస్తున్నారు. ముందుగా ఇరు పార్టీలకు చెందిన ఇన్‌చార్జిలకు చెందిన సమ్మతిని తీసుకుంటూ పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఈ వ్యవహారం కూడా ప్రస్తుతం నియోజకవర్గాల్లో ఆయా పార్టీల్లో ఇన్‌చార్జిలుగా ఉన్న వారికి గుబులు పుట్టిస్తోంది.

ఈ నేపథ్యంలో బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి రాజమహేంద్రవరం, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో ఇటీవల పర్యటించి కేడర్‌ను సమాయత్తం చేశారు. అంతేగాక పాటు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రణాళికతో ఎన్నికలకు వెళ్తాయనే సంకేతాన్ని పరోక్షంగా ఇచ్చారు.

కాగా కాంగ్రెస్ ఏపీ అధ్యక్షుడిగా కోనసీమ నుంచి నియమితులైన మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు తనదైన శైలిలో వ్యూహరచన చేస్తున్నారు. సీఎం జగన్ సోదరి షర్మిల కాంగ్రెస్ తీర్థం తీసుకోవడంతో ఆ పార్టీ శ్రేణులు ఎన్నికల కదనరంగంలోకి నూతనోత్తేజంతో ముందుకు సాగేందుకు సన్నాహాలు చేపట్టాయి.

కమ్యూనిస్టు పార్టీలు ప్రజా ఉద్యమాల పేరుతోను, వివిధ కార్మిక సంఘాలు హక్కుల సాధనకు పోరాడుతూ ఉనికిని కాపాడుకుంటూ ఎన్నికలకు సంసిద్ధులవుతున్నారు. ఆర్పీఐ సహా ఇతర ప్రాంతీయ పార్టీలన్నీ రానున్న ఎన్నికల కోసం అప్పుడే సభలు, సమావేశాలు నిర్వహిస్తూ రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నాయి,

2,272 మందికి రూ.3.54 కోట్ల లబ్ధి

అమలాపురం టౌన్, జనవరి 5: జిల్లాలో సంక్షేమ పథకాలకు అర్హత ఉండి పొందలేని 2,272 మంది లబ్ధిదారులకు రూ.3.54 కోట్ల లబ్ధి చేకూరుస్తూ మెగా చెక్కును జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ శుక్రవారం అందజేశారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు మెట్టి గౌరీశంకరరాజు, డీఎల్డీవో పి.వియ్‌థామస్, వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్‌ఖాదర్, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

అంతా గంటలోనే...!

ఇదీ సామాజిక సాధికార బస్సు యాత్ర తీరు

మలికిపురం, జనవరి 5: మలికిపురంలో శుక్రవారం జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్ర కేవలం గంటలోపే ముగిసింది. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రాజకీయ సాధికారత కల్పించి వారి కలలను సాకారం చేసింది సీఎం జగన్ అన్నారు. స్థానిక కనకదుర్గ గుడి సెంటర్లో బస్సుపై నుంచి మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, పినిపే విశ్వరూప్, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మాట్లాడారు. ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణరావు, తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు సుబ్బరాజు, కేఎస్ఎన్ రాజు, రాపాక వెంకట్రామ్ తదితరులు పాల్గొన్నారు. సభా స్థలికి బస్సు రాగానే మంత్రులు, ఎమ్మెల్యే బస్సు ఎక్కారు. ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ప్రసంగం మొదలుపెట్టిన అనంతరం మహిళలు వెనుదిరగడాన్ని గ్రహించి సభను గంటలోపే ముగించారు. తనకు అసెంబ్లీ టిక్కెట్ రాని నేపథ్యంలో పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు గైర్హాజరయ్యారు. బస్సు యాత్రకు రాకుంటే రుణమాఫీ రాదని బెదిరించి యానిమేటర్లు డ్వాక్రా మహిళలను బలవంతంగా తీసుకొచ్చారు. బస్సు యాత్రకు కచ్చితంగా రావాలని, వచ్చినవారు సభా ప్రాంగణంలో గ్రూపు ఫొటోలు తీసుకుని పెట్టాలని వలంటీర్లను ఆదేశించినట్టు తెలిసింది.

తెలుగు జాతికి సేవలందించినవారు ధన్యులు

● తెలుగు మహాసభల్లో జస్టిస్ కృష్ణమోహన్ ● పూర్ణకుంభ అవార్డుల ప్రదానోత్సవం ● గైట్ కళాశాలలో అంతర్జాతీయ తెలుగు మహాసభలు



తెలుగుజాతికి వివిధ రంగాల్లో సేవలందించిన తనికెళ్ల భరణి, మండలి బుద్ధప్రసాద్, తదితరులకు పూర్ణకుంభ పురస్కారాలను అందజేస్తున్న జస్టిస్ కృష్ణమోహన్, పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఆచార్య కొలకలూరి ఇనాక్, చైతన్యరాజు, గజల్ శ్రీనివాస్



గైట్ కళాశాలలో జరుగుతున్న అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో పాల్గొన్న కవులు, రచయితలు, ప్రముఖులు

రాజానగరం, జనవరి 5: తెలుగుజాతికి పూర్వీకులు అందించిన సేవలను గుర్తించుకుని వారి వారసులను సత్కరించడం అభినంద నీయమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ అన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థలు సంయుక్త ఆధ్వర్యంలో గైట్ కళాశాలలో జరుగుతున్న అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో భాగంగా శుక్రవారంరాత్రి రాజరాజ నరేంద్రుని వేదికపై నిర్వహించిన పూర్ణకుంభ అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. తెలుగుజాతికి ఎందరో మహనీయులు అంకితభావం, సేవాభావంతో పనిచేసి ఆనందంగా జీవించారని, అలాగే మనందరం పనిచేసి రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలన్నారు.

ప్రాథమిక విద్యాబోధన మాతృభాషలోనే జరగాలి

మహోన్నత చరిత్ర కలిగిన తెలుగువారందరికీ మనం ప్రతినిధులమన్న సంగతి మర్చిపోకుండా ఈ వారసత్వాన్ని భవిష్యత్తుతరాలకు అందించాల్సిన ఆవశ్యకత అందరిపై ఉందని మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. తెలుగు భాష, జాతి అనేక సవాళ్లు ఎదుర్కొంటున్న తరుణంలో విద్యార్థులకు తెలుగుజాతి ప్రతిభ, చైతన్యాన్ని పరిచయం చేయడం అభినందనీయమన్నారు. రాజమహేంద్రవరంలో సాంస్కృతిక వారసత్వం పుణికిపుచ్చుకున్న వాళ్లు ఎందరో ఉన్నారని, అందుకే ఇది సాంస్కృతి రాజధాని అని పేర్కొన్నారు.

పురస్కారాలు అందించడం అభినందనీయం

● సినీ రచయిత తనికెళ్ల భరణి

సినీ రచయిత తనికెళ్ల భరణి మాట్లాడుతూ ఇంతమంది గొప్ప తెలుగువారి వారసులను ఒకే వేదిక మీదకు రప్పించి పురస్కారాలు అందించడం అభినందనీయమన్నారు. ఇంతమందిని చూశాక తన జన్మ ధన్యమైందన్నారు. గజల్ శ్రీనివాస్ తలపెట్టిన తెలుగుసభల నిర్వహణకు సహకరించడం చైతన్యరాజు చిరకాలం గుర్తుంటారని భరణి పేర్కొన్నారు.

ఘనంగా పూర్ణకుంభ పురస్కారాల ప్రదానం..

తెలుగుజాతికి సేవలందించిన వివిధ రంగాల ప్రముఖుల వారసులు అలాగే వివిధ రంగాల్లో సేవలందిస్తున్న ప్రముఖులకు పూర్ణకుంభ పురస్కారాలతో జస్టిస్ కృష్ణమోహన్, పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఆచార్య కొలకలూరి ఇనాక్, ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి చేతులమీదుగా చైతన్యరాజు, గజల్ శ్రీనివాస్ అందజేశారు. తరిగొండ వెంగమాంబ, కవయిత్రి మొల్ల, తిక్కన సోమయాజి, డొక్కా సీతమ్మ, పరవస్తు చిన్నయసూరి, గుర్రం జాషువా, మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి, పెద్దింటి దీక్షిత్‌దాసు, ఘంటసాల వెంకటేశ్వరరావు, మండలి వెంకట కృష్ణారావు, సాలూరి రాజేశ్వరరావు, పీబీ శ్రీనివాస్, జంధ్యాల, మునా రాయలు, బాపు తదితరుల వారసులు పురస్కారాలు స్వీకరించారు. అలాగే విశ్వనాథ గోపాలకృష్ణ, దాట్ల బుచ్చి వెంకటపతి రాజు, జిత్‌మోహన్‌మిత్ర, ఎర్రాప్రగడ రామకృష్ణ, కూచిబొట్ల ఆనంద్, రసరాజు, బాదం బాలకృష్ణ, వంశీ రామరాజు, చెరుకువాడ రంగసాయి, తనికెళ్ల భరణి, గౌతమీ గ్రంథాల యం, నన్నయ భట్టారక పీఠం, చింతలూరు ఆయుర్వేద ఫార్మసీ పతినిధులు పురస్కారాలు అందుకున్నవారిలో ఉన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, గైట్ మేనేజింగ్ డైరెక్టర్ కె.శశికిరణ్ వర్మ, ఆంధ్ర సారస్వత పరిషత్ ముఖ్య సలహాదారు కె.రామ్‌ప్రసాద్, శతావధాని కడిమెళ్ల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.







వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన విద్యార్థులు





తెలుగు మహాసభలకు హాజరైన విద్యార్థులు





అంతర్జాతీయ తెలుగు మహాసభలలో జరుగుతున్న సాహితీ సదస్సులో మాట్లాడుతున్న ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త గరికపాటి నర్సింహారావు, జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జస్టిస్ కృష్ణమోహన్

మాజీ ఎంపీ కొత్తపల్లి గీత ఎస్టీ కాదు

● ఏపీ ఎస్టీ ఉద్యోగుల సంఘం అప్పీలుపై జీవో జారీచేసిన ప్రభుత్వం

● 2016లో ఎస్టీగా నిర్ధారించిన తూర్పు కలెక్టరు ఉత్తర్వులు రద్దు

రంపచోడవరం, జనవరి 5: అరకు మాజీ ఎంపీ, బీజేపీ నాయకురాలు కొత్తపల్లి గీత ఎస్టీ కులస్తురాలు కాదంటూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 2016లో ఆమెపై జరిగిన కులవిచారణ నివేదిక ఆధారంగా అప్పటి తూర్పుగోదావరి జిల్లా కలెక్టరు సదరు కొత్తపల్లి గీత ఎస్టీ (వాల్మీకి) కులస్తురాలేనంటూ నిర్ధారిస్తూ ఉత్తర్వులను ఇచ్చారు. దీనిపై ఏపీ ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఇ. ఆంజనేయులు, ఆర్.మహేశ్వరరావు సదరు కలెక్టరు ఉత్తర్వులను ఆక్షేపిస్తూ ప్రభుత్వం వద్ద 2016లోనే అప్పీలు దాఖలు చేశారు. ఈ అప్పీలుపై తెలుగుదేశం ప్రభుత్వంలోనూ, వైకాపా ప్రభుత్వంలోనూ మొత్తం నలుగురు మంత్రులు విచారణ జరిపారు. ఇటీవల కాలంలో ఈ అప్పీలుపై జరుగుతున్న విచారణ తీరుపై కొత్తపల్లి గీత రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. 2023 ఏప్రిల్‌లో హైకోర్టు ఉత్తర్వులు జారీ చేస్తూ నాలుగు నెలల్లో ఈ అప్పీలును ముగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ అప్పీలు కేసును ప్రస్తుత గిరిజన సంక్షేమ మంత్రి పి.రాజన్నదొర విచారణ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వం గురువారం నాడు గిరిజన సంక్షేమ (కుల విచారణ) విభాగం ద్వారా జీవో ఎమ్ఎస్.నెం.2ను జారీ చేస్తూ 2016లో కొత్తపల్లి గీతను ఎస్టీగా నిర్ధారిస్తూ అప్పటి కలెక్టరు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ ఆమె ఎస్టీ కాదని ప్రభుత్వం పేర్కొంది.

ఘంటసాలకు నివాళులర్పించిన కోడలు పార్వతి



ఘంటసాల పార్వతిని సత్కరిస్తున్న కల్చరల్ అసోసియేషన్ సభ్యులు

ధవళేశ్వరం, జనవరి 5: ధవళేశ్వరం ఇరిగేషన్ పార్కులో ఏర్పాటుచేసిన అమరగాయకుడు ఘంటసాల విగ్రహాన్ని ఆయన కోడలు ఘంటసాల పార్వతి, టీవీ యాంకర్, డబ్బింగ్ ఆర్టిస్ట్ శిల్పతో కలిసి సందర్శించి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ ఘంటసాల కోడలు కావడం పూర్వజన్మ సుకృతమన్నారు. ఆమెను గోదావరి కల్చరల్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఘంటసాల విగ్రహాన్ని ఏర్పాటుచేసిన అసోసియేషన్ సభ్యులను ఆమె అభినందించారు. రాక రమణ, యర్రమోతు ధర్మరాజు, గ్రంధి జగన్నాథం, తాతారావు, శేషకుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పిఠాపురంలో విజిలెన్స్ తనిఖీలు

● 29.6క్వింటాళ్ల రేషన్‌బియ్యం స్వాధీనం ● ఇద్దరిపై కేసు నమోదు

పిఠాపురం, జనవరి 5: కాకినాడ జిల్లా పిఠాపురంలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు అందిన సమాచారంతో అధికారులు పలు వాహనాలను పరిశీలించారు. మినీవ్యాన్‌లో తరలిస్తున్న 48 సంచుల్లో ఉన్న 24.10క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. కార్డుదారులు, ఎండీయూ ఆపరేటర్ నుంచి కిలో రూ.20లకు వీటిని కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. కార్డుదారులకు రేషన్‌సరుకులు అందించాల్సిన ఎండీయూ వాహనాన్ని రేషన్‌బియ్యం అక్రమ రవాణాకు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. 11 సంచుల్లో ఉన్న 5.50 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించారు. రెండు వాహనాల్లో ఉన్న 29.60 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఎండీయూ వాహనం, మినీ వ్యాన్‌లను సీజ్ చేశారు. రేషన్‌బియ్యం అక్రమంగా తరలిస్తున్న ఎండీయూ ఆపరేటర్ పైలా శ్రీను, కందరాడకు చెందిన సీహెచ్.లక్ష్మణరావులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.



పిఠాపురంలో విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్‌బియ్యం, వాహనాలు

ఇటలీ నుంచి వచ్చి.. ఆటో కొని..

● పర్యాటక ప్రాంతాలను చుట్టేస్తున్న విదేశీయులు

● పొల్లూరు ట్రైగ్రిస్ జలపాతం వద్ద ఇటలీవాసుల సందడి

మోతుగూడెం, జనవరి 5: అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో గురువారంరాత్రి నుంచి ఇటలీ దేశస్థులు మోతుగూడెం, పొల్లూరులో సందడి చేశారు. వీరు ఇటలీ నుంచి ఢిల్లీ వచ్చారు. ఢిల్లీ నుంచి కేరళ వెళ్లి కొచ్చిలోని ప్రకృతి అందాలను చూస్తూ కాలం గడిపారు. తర్వాత ఆటో కొనుగోలుచేసి కొచ్చి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజుజిల్లా మోతుగూడెం ప్రాంతంలోని ప్రకృతి అందాలను చూడ్డానికి వచ్చామన్నారు. మోతుగూడెం పరిసర ప్రాంతాల్లో ఉన్న పొల్లూరు జలపాతం, ఫోర్‌బై కెనాల్, డొంకరాయి డ్యామ్ చూసి మేఘాలయ పయనమయ్యారు.



పొల్లూరు ట్రైగ్రిస్ జలపాతం సందర్శనకు వచ్చిన ఇటలీ వాసులు

పూల ప్రేమికులకు ఆహ్వానం

● నేడు ఫలపుష్ప ప్రదర్శన, ప్రజా ఉత్సవాలు ప్రారంభం



ఆకర్షిస్తున్న రంగురంగుల పుష్పాలు

యానాం, జనవరి 5: తూర్పుగోదావరి జిల్లాలో అంతర్భాగంగా ఉన్న కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నియోజకవర్గంలో పూలప్రేమికులను ఆహ్లాదపరిచేందుకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 22వ ఫలపుష్ప ప్రదర్శనకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడామైదానంలో గత 20 సంవత్సరాలుగా ఈ ఉత్సవాలను జనవరి 6నుంచి8 వరకూ మూడు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తున్నారు. నేడు ప్రారంభం కానున్న ఈ ఫలపుష్ప ప్రదర్శనకు పుదుచ్చేరి మంత్రులతోపాటు ఉన్నాతాదికారులు, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ వివిధశాఖల అధికారులు హాజరుకానున్నారు. ముఖ్యంగా ఈ ఫలపుష్పప్రదర్శన యానాం, పరిసర ప్రాంత ప్రజలకు మంచి ఆహ్లాదకర వాతావర ణాన్ని చేకూరుస్తోంది. వీటిలో తూర్పుగోదావరి జిల్లాలోని కడియం, రాజమహేంద్రవరం, బెంగుళూరు, తదితర ప్రాంతాల నుంచే కాకుండా యానాం వ్యవసాయశాఖ, మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పెంచుతున్న వివిధ రకాల జాతులు ఫలపుష్పాలను ప్రదర్శనకు ఉంచుతారు. అన్ని ఏర్పాట్లు స్థానిక వ్యవసాయ శాఖ డీడీ శివసుబ్రహ్మణ్యన్ పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే వివిధ నర్సరీల నుం చి అనేక రకాల పూలమొక్కలు యానాం చేరుకున్నాయి. నేడు సాయంత్రం 4గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. మూడు రోజులపాటు జరిగే ఈ ఫలపుష్ప ప్రదర్శనలో ప్రజల నందరినీ ఆకర్షించే విధంగా వివిధ రకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ రఘునాయగం ఆధ్వర్యంలో సీఐ షణ్ముగం గట్టి బందోబస్తును సిద్ధం చేశారు.



ప్రదర్శనలో ఉంచిన వివిధ రకాల ఫలపుష్పాలు



ఫలపుష్ప ప్రదర్శన ఏర్పాట్లును పరిశీలిస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

ఆశ్రమ పాఠశాల బాలిక మృతి

● హెచ్‌ఎం, వార్డెన్ నిర్లక్ష్యమంటూ బంధువుల రాస్తారోకో

● ట్రైబల్ వెల్ఫేర్ డీడీతో విచారణ జరిపించనున్న ఐటీడీఏ పీవో

కూనవరం, జనవరి 5: కూనవరం మండలం నర్సింగపేట ఆశ్రమ పాఠశాలకు చెందిన మడకం సంధ్య(12) కడుపునొప్పితో మృతి చెందింది. ఈ మృతికి ఆశ్రమ పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయురాలు, వార్డెన్ నిర్లక్ష్యం అంటూ బాలిక బంధువులు ఆశ్రమ పాఠశాల ఎదుట పెద్దఎత్తున నాలుగు గంటలపాటు రాస్తారోకో నిర్వహించారు. మృతురాలి బంధువుల కథనం ప్రకారం ఎటపాక మండలం ఎర్రబోరు గ్రామానికి చెందిన సంధ్య నర్సింగపేట ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. ఈనెల 1న తీవ్రమైన కడుపునొప్పి వచ్చింది. కడుపునొప్పితో సంధ్య బాధపడుతూనే ఉంది. ఆ సమయంలో పాఠశాల సిబ్బంది నూతన సంవత్సర వేడుకల్లో మునిగితేలడంతో సంధ్యను పట్టించుకోలేదని బంధువులు చెబుతున్నారు. కనీసం సిబ్బంది అందుబాటులో కూడా లేరని బంధువులు ఆరోపిస్తున్నారు. తెల్లారి రెండో తేదీన సంధ్య కడుపునొప్పితో బాధపడుతూనే పాఠశాల సిబ్బందికి తెలియజేసింది. పాఠశాలలో పని చేస్తున్న ఆయాతో కోతులగుట్ట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. సంధ్య వెంట పాఠశాల వార్డెన్‌గాని, టీచర్‌గాని వెళ్లలేదు. ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న సంధ్య పాఠశాలకు తిరిగివచ్చి పాఠశాలలోని సిక్ రూమ్‌లో ఉంది. అదే సమయంలో ఎర్రబోరుకు చెందిన ఓ మహిళ అదే పాఠశాలలో చదువుతున్న తన కూతురిని చూడటానికి వచ్చింది. సిక్‌రూమ్‌లో ఉన్న సంధ్య ఆరోగ్య పరిస్థితి గమనించి ఇంటికివెళ్లి బాలికకు తల్లిదండ్రులు ఎవరు లేకపోవడంతో సంధ్య పెద్దమ్మకు ఆ మహిళ విషయం తెలియజేసింది. హుటాహుటిన పాఠశాలకు వచ్చిన ఆమె సంధ్యను తమ ఇంటికి తీసుకువెళతానని పాఠశాల హెచ్‌ఎంకి తెలిపింది. పాఠశాల సిబ్బంది తెలివిగా తీసుకువెళితే తమకు ఎటువంటి బాధ్యతలేదని లెటర్ రాయించుకుని సంధ్యను ఇంటికి పంపించారు. అయితే ఇంటికి వెళ్లాక 4వ తేదీన మళ్లీ సంధ్యకు తీవ్ర కడుపునొప్పి రావడంతో ఎర్రబోరునుంచి భద్రాచలం ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. మార్గమధ్యలోనే సంధ్య మరణించింది. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంతోనే సంధ్య చనిపోయిందంటూ ఆమె బంధువులు మృతదేహాన్ని తీసుకువచ్చి రాస్తారోకో నిర్వహించారు. సుమారు 4గంటలపాటు రాస్తారోకో నిర్వహించారు. విచారణ జరిపిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. శనివారం ట్రైబల్‌వెల్ఫేర్ డీడీని విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య విచారణకు ఆదేశించారు.



బాలిక మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న బంధువులు, టీడీపీ నాయకులు, ఇన్‌సెట్‌లో బాలిక సంధ్య

కువైట్‌లో గుండెపోటుతో మృతి చెందిన అంతర్వేది వాసి



కొల్లాబత్తుల కుమార్‌రత్నం

అంతర్వేది, జనవరి 5: సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రా మానికి చెందిన కొల్లాబత్తుల కుమార్‌రత్నం(50) గుండెపోటుతో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. పది సంవత్స రాలు కువైట్ దేశంలో పనిచేసుకుంటూ రెండు, మూడుసార్లు స్వదేశానికి వచ్చి మళ్లీ అదే దేశంలో ఉద్యోగం చేస్తుండగా గుండె పోటు రావడంతో మృతి చెందారు. కుమార్ రత్నానికి భార్య, పాప ఉన్నారు. ఆర్థిక పరిస్థితి బాగోలేక పొట్ట చేత పట్టుకుని కువైట్ వెళ్లిన కుమార్‌రత్నం మరణవార్త వినగానే కుటుంబ సభ్యులంతా శోకసంద్రంలో మునిగితేలారు. కువైట్ తెలుగు సేవలు సంస్థ ఆధ్వర్యంలో మృతదేహాన్ని స్వగ్రామానికి పంపిస్తున్నట్టు జి.మురళి తెలిపారు. కువైట్‌లో మంగళవారం గుండెపోటుతో మృతి చెందిన కుమార్‌రత్నం మృతదేహాన్ని శుక్రవారం సాయంత్రం అంతర్వేది చేరుకోవడానికి కువైట్ తెలుగు సేవాసంస్థకు పలువురు సహకరి ంచారని అంతర్వేది గ్రామస్థులు తెలిపారు.

నేడు కల్యాణోత్సవాలపై సమీక్షా సమావేశం

అంతర్వేది, జనవరి 5: మాసమాసంలో ప్రారంభమయ్యే అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలపై ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి ఆధ్వర్యంలో శనివారం సమీక్షాసమావేశం నిర్వహిస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సామర్లకోట, జనవరి 5: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం మాధవపట్నం గ్రామ శివారున పొలాల్లో చెట్టుకొమ్మ కు ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. వీఆర్వో ఇచ్చిన సమాచారంతో సామర్లకోట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడు దండంగి రాంబాబు(35)గా ప్రాథమికంగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు

అంబాజీపేట, జనవరి 5: ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తున్నారని బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ వీకే రావు అన్నారు. అంబాజీపేట, తొండవరం జడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు శుక్రవారం విద్యాభారతి స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్‌లు నాగాబత్తుల శాంతకుమారి, పేరాబత్తుల దొరబాబు, పితాని మంగాదేవి, మద్దింశెట్టి దొరబాబు, ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు, వడ్లమాని పద్మావతి, హెచ్‌ఎంలు వి.కేశవచార్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలి

25వ రోజుకు అంగన్‌వాడీల నిరవధిక సమ్మె

అమలాపురం టౌన్, జనవరి 5: అంగన్‌వాడీలకు పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీలను అమలుచేసే వరకు ఆందోళన విరమించేది లేదని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధ్యక్షురాలు కె.బేబిగంగారత్నం హెచ్చరించారు. ప్రభుత్వం ఎన్ని కుయుక్తులు పన్నినాసమ్మె కొనసాగిస్తామన్నారు. ఐసీడీఎస్ అమలాపురం ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 25వ రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండు చేశారు. ఇప్పటికే క్రిస్మస్‌కు దూరమయ్యాం... జనవరి 1వేడుకలు జరుపుకోలేకపోయాం... కనీసం సంక్రాంతి నాటికైనా సమస్యలు పరిష్కరించాలి... లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మె శిబిరాన్ని శనివారం నుంచి అమలాపురం కలెక్టరేట్ ఎదుటకు మార్పు చేస్తున్నామని, అక్కడే నిరాహార దీక్షలు చేపడతామన్నారు. తొలి రోజు అమలాపురం, రామచంద్రపురం ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీలు పాల్గొంటారని జిల్లా కోశాధికారి పి.అమూల్య తెలిపారు. దీక్షా శిబిరంలో ప్రాజెక్టు ప్రతినిధులు విజయ, దైవకృప, రుక్మిణి, కనకమహాలక్ష్మి, సీత, నవోమి, రత్నకుమారి, భవ్యశ్రీ, సరోజిని, సత్యలలిత తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: అంగన్‌వాడీలు చేపట్టిననిరవధిక సమ్మె శుక్రవారం నాటికి 25వ రోజుకు చేరుకుంది. 25రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడాన్ని నిరసిస్తూ వారంతా 25ఆకారంలో కూర్చుని దీక్షా శిబిరం వద్ద నిరసన తెలిపారు. ముమ్మిడివరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిదిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు దీక్షల్లో పాల్గొన్నారు. డిమాండ్లు పరిష్కరించకపోతే శనివారం నుంచి 24గంటలు దీక్షలు చేపడతామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకుడు జి.దుర్గాప్రసాద్, ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జయలక్ష్మి, ఎస్.దుర్గామహేశ్వరిలు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీల పట్ల వ్యవహరిస్తున్న వైఖరిని తీవ్రంగా విమర్శించారు. ధనలక్ష్మి, శ్రీదేవి, తలుపులమ్మ, ఎన్.విజయకుమారి, కె.సత్యవతి, సుబ్బలక్ష్మి, అంజనీదేవి, ఎస్.కనకదుర్గ, శ్రీదేవి, రమాదేవి, వి.తలుపుల మ్మ, ఎస్.విజయ్‌కుమార్, వి.సత్యవతి పాల్గొన్నారు.

మండపేట: అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె శుక్రవారం 25వ రోజుకు చేరుకుంది. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన దీక్షా శిబిరంలో ప్రభుత్వ తీరుకు నిరసనగా అంగన్‌వాడీలు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

మామిడికుదురు: డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీలు ఒంటి కాలిపై నిలుచుని 25వ రోజు నిరసన తెలిపారు. 25 రోజులుగా కోర్కెల సాధన కోసం సమ్మెచేస్తుంటే ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరించడంపై ఆవేదన వ్యక్తంచేశారు. న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలన్నారు. ఎస్.అన్నపూర్ణ, బి.సూర్యకాంతం, కె.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పి.గన్నవరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం అంగన్‌వాడీలు నిరసన చేపట్టారు. తొలుత ప్రభుత్వం ఆదేశాలమేరకు సమ్మెను విరమించాలని, నిబంధనలు అనుసరించి ప్రభుత్వం తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని ఐసీడీయస్ సీడీపీవో విజయశ్రీ అంగన్‌వాడీలను హెచ్చరించారు. దీంతో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బండి వెంకటలక్ష్మి, అంగన్వాడీలు మాట్లాడుతూ యూనియన్ తీసుకున్న నిర్ణయాన్ని కట్టుబడి ఉన్నామని, సమ్మె విరమించే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

రామచంద్రపురం: 25రోజులుగా నిరసన తెలుపుతున్న అంగన్వాడీల ఆగ్రహ జ్వాలలు శుక్రవారం మిన్నంటాయి. ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసులను దహనం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట 25వ రోజు దీక్షను సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రారంభించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రెడ్డి సుబ్రహ్మణ్యం దీక్ష శిబిరానికి వచ్చి మద్దతు తెలిపారు. అంగన్వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరి చూస్తుంటే దున్నపోతు మీద వర్షం పడినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తామని హామీఇచ్చారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి మేడిశెట్టి దుర్గమ్మ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూకల బలరాం, వాసంశెట్టి సూర్యకుమారి, కె.విజయలక్ష్మి, శ్రీదేవి, జహేరా, దుర్గ, వెంకటరత్నం, గొంతీదేవి, అంగన్వాడీలు పాల్గొన్నారు.




మండపేటలో మోకాళ్లపై నిలబడి అంగన్‌వాడీల నిరసన, మామిడికుదురు:ఒంటి కాలిపై నిలుచుని అంగన్‌వాడీల నిరసన

సామాజిక న్యాయానికి తూట్లు పొడిచి బస్సు యాత్రలా

మలికిపురం, జనవరి 5: సామాజికన్యాయానికి తూట్లు పొడిచి బస్సు యాత్రలు చేయడం హాస్యాస్పదంగా ఉందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. వైసీపీ ప్రభుత్వం చేపట్టిన సామాజిక బస్సు యాత్రను నిరసిస్తూ శుక్రవారం దిండిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించి నిరసన తెలిపారు. నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు అంటూ నమ్మబలికి ఆయా సామాజిక వర్గాలను జగన్మోహన్‌రెడ్డి నయవంచన చేశారన్నారు. ముదునూరి శ్రీనివాసరాజు, ఎంపీపీ కేతా శ్రీనివాస్, అమలాపురం పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి బందెల పద్మ, తాడి దుర్గాసురేష్, గోనిపాటి రాజు, చాగంటి స్వామి, వలవల శేఖర్, కట్టా బాబులు, కట్టా నాగరాజు పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వాన్ని గద్దెదించాలి: ఎమ్మెల్యే

రాయవరం, జనవరి 5: అరాచక ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శుక్రవారం రాయవరంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. టీడీపీ పాలనలో రాయవరం గ్రామాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేశామన్నారు. రాష్ట్రం తిరిగి అభివృద్ధి సాధించాలంటే వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నల్లమిల్లి సత్యనారాయణ రెడ్డి, ఉం డవిల్లి రాంబాబు, వెలుగుబంట్ల గోపీకృష్ణ, కోడి చిన్న అప్పారావు, మేడపాటి రవీంద్రారెడ్డి, నేతల సురేష్, మాజీ సర్పంచ్ పాలింగి చిన్నబాబు, చల్లా సత్యనారాయణ, మల్లిపూడి చిన్న, వల్లూరి చిన్న, వల్లూరి శ్రీనివాసచౌదరి పాల్గొన్నారు.

రాష్ట్రానికి చంద్రబాబు ష్యూరిటీ

అమలాపురం టౌన్, జనవరి 5: అప్పుల పాలైన రాష్ట్రాన్ని గాడిన పెట్టి అభివృద్ధి సాధించేందుకు చంద్రబాబు ష్యూరిటీ ఇస్తున్నారని టీడీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. శుక్రవారం గొవ్వాల వీధిలో రచ్చబండ సమావేశం నిర్వహించారు. అనంతరం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు ప్రకటించిన సూపర్-6 పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్ర పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, పలివెల శ్రీను, గెల్లా మీనాకుమారి, కుంచే వెంకన్నబాబు, శెట్టిబత్తుల దిన్బాబు, మాకిరెడ్డి వీఎస్ఎస్ పూర్ణిమ, బత్తుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కైలాస రథం బహూకరణ



కె.గంగవరం, జనవరి 5: దంగేరు శ్మశానవాటికకు రావిపాటి కుటుంబం కైలాస రథాన్ని బహూకరించింది. రావిపాటి వెంకటాద్రి, అనంతలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం వారి మనుమలు రూ.7లక్షలతో కైలాస రథాన్ని తయారుచేయించి శుక్రవారం దంగేరు శ్మశానవాటికకు అందజేశారు. దంగేరు పరిసర గ్రామాల ప్రజలు దీనిని ఉపయోగించుకోవచ్చునని తెలిపారు. ఫోన్ నెంబరు8297000666కు సంప్రదించాలన్నారు.

గోదాదేవి గ్రామోత్సవం

ఆత్రేయపురం, జనవరి 5: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం గోదాదేవి అమ్మవారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. వేకువజామునే గోదావరి జలాలను తీసుకువచ్చి ఉత్సవమూర్తులకు అభిషేకాలు నిర్వహించారు. ధనుర్మాస పూజలు నిర్వహించారు. శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,89,845 లభించినట్టు ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

నేత్ర దానం

ఆత్రేయపురం, జనవరి 5: పేరవరానికి చెందిన బెజవాడ కొండయ్య(75) శుక్రవారంఅనారోగ్యంతో మృతిచెందాడు. ఈయన నేత్రాలను దానం చేయడంతో రాజమహేంద్రవరం శ్రీరాధాకృష్ణ ఐ బ్యాంక్ సిబ్బంది నేత్రాలను సేకరించారు. ఆయనకు భార్య అక్కాయమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

221మందికి వైద్య సేవలు

ద్రాక్షారామ, జనవరి 5: ద్రాక్షారామ 1వ సచివాయంలో శుక్రవారం జరిగిన ఆరోగ్యసురక్ష కార్యక్రమంలో 221మందికి వైద్యసేవలుందించారు. పీహెచ్‌సీ వైద్యులు డా.సందీప్‌నాయుడు, డా. అలేఖ్య, ఏరియా ఆసుపత్రి వైద్యులు డా. జి.సుశీల, డా.బి.సౌమ్య డా. ఎంఈ ఆలీ వైద్యసేవలందించారు. ఎంపీపీ అంబటి భవానీ, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ నిరుద్యోగ యువత ఆధ్వర్యంలో ఆందోళన

ఉప్పలగుప్తం, జనవరి 5: గత ఏడాది డిసెంబరులో గ్రామాభివృద్ధిపై ఇచ్చిన హామీని అధికారులు విస్మరించారంటూ ఎస్.యానాంలో శుక్రవారం యువత ఆధ్వర్యంలో ధర్నా ప్రారంభించారు. ఈనెల9,10,11తేదీలో ఆర్డీవో కేశవర్ధనరెడ్డి గ్రామానికి వచ్చి రవ్వ ప్రతినిధులు, గ్రామస్తులతో మాట్లాడి గతంలో ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరుపై అధ్యయనం చేసి కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తారని తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి ఆందోళనకారులకు వివరించి ఆందోళన విరమించాలని కోరారు.అధికారుల హామీలపై తమకు నమ్మకం లేదన్నారు. ఆందోళన కొనసాగుతుందన్నారు. అనంతరం ఆందోళనకారులు చర్చించుకుని ఈనెల12వతేదీ వరకు వేచి చూస్తామని, సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన చేస్తామని అధికారులకు చెప్పి, రాత్రి ఎనిమిది గంటలకు ఆందోళన విరమించారు. రేవు తిరుపతిరావు, పెట్టా అప్పారావు, పలచోళ్ళ పద్మనాభం, ముత్తాబత్తుల శ్రీను, లంకే సహదేవరావు అయితాబత్తుల అజయ్, బొంతు బాలరాజు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకుకు శంకుస్థాపన

ఉప్పలగుప్తం, జనవరి 5: నంగవరం జిన్నూరివారిపాలెంలో జలజీవన్ మిషన్ నిధులు రూ.23లక్షలతో వాటర్ ట్యాంకు నిర్మాణానికి సర్పంచ్, రాష్ట్ర ఉద్యానవన విశ్వవిద్యాలయ బోర్డు డైరెక్టర్ జిన్నూరి వెంకటేశ్వరరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మానే శ్రీనివాసరావు, దొమ్మేటి కిశోర్, జిన్నూరి దుర్గారావు పాల్గొన్నారు.

సోమిశెట్టి హోటల్ వార్షికోత్సవం

రాజోలు, జనవరి 5: తాటిపాకలోని సోమిశెట్టి ల్యాండ్ మార్కు హోటల్ పదో వార్షికోత్సవాన్ని ఎండీ సోమిశెట్టి ఆంజనేయులు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. హోటల్ జేఎండీ సోమి శెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, ఎంపీపీ కేతా శ్రీను, కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, మెట్ల రమణబాబు, జడ్పీటీసీ మట్టా శైలజ, సర్పంచ్ కోటిపల్లి రత్నమాల పాల్గొన్నారు.

రాష్ట్రం నుంచి పరిశ్రమలను తరిమేసిన ఘనత జగన్‌దే

మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



టీఎన్టీయూసీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనందరావు తదితరులు

అమలాపురం టౌన్, జనవరి 5: టీడీపీ హయాంలో రాష్ట్రానికి వెల్లువలా పరిశ్రమలు వచ్చాయని మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం నుంచి పెద్దపెద్ద పరిశ్రమలను తరిమేశారని ధ్వజమెత్తారు. సైకో పాలనలో పరిశ్రమలు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు సైతం ముందుకు రావట్లేదని విమర్శించారు. కార్మికుల ఉపాధిని దెబ్బతీసిన ఘనత జగన్ ప్రభుత్వానిదేనన్నారు. టీఎన్టీయూసీ ఆధ్వర్యంలో బస్సు యాత్ర సందర్భంగా అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సబ్బతి ఫణీశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి జిల్లా అధ్యక్షుడు కుసుమ సూర్యమోహనరావు అధ్యక్షత వహించారు. రాష్ట్రంలోని పరిశ్రమలన్నీ పక్క రాష్ట్రాలకు తరలిపోతే కార్మికులకు ఉపాధి ఎక్కడ దొరుకుతుందని ప్రశ్నించారు. నియోజకవర్గ అధ్యక్షుడు వలవల శివరావు, రాష్ట్ర అధికారి ప్రతినిధి వాదా ప్రసాద్, బండారు సత్యనా రాయణమూర్తి, జిల్లా అధికారి ప్రతినిధి కాశిన జయనాథ్, చిట్టిమేను దత్తాత్రేయ, మద్దెల సూర్యచంద్రరావు, బూసి సోమన్న, బండి సుబ్బారావు, పెనుమాల రమణ, కేతా శ్రీను, గుండుమోగుల పెదకాపు, యాళ్ల రాంబాబు, అడ్డాల శంకరరావు, చిట్టూరి సత్యనారాయణపాల్గొన్నారు.

'నిందితులకు వత్తాసు పలికిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి'

రాయవరం, జనవరి 5: మాచవరంలో వైసీపీ నాయకులు అరాచకాలకు వత్తాసు పలుకుతున్న రాయవరం ఎస్ఐ జి.నరేష్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం రాయవరంలో ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. మాచవరానికి చెందిన గుణ్ణం భాస్కరరావు తన ఇంటి వద్ద క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ టీడీపీ నాయకులతో ఉన్న ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్సీ నిర్వహించిన సందర్భంగా భాస్కరరావు తన ఇంటి వద్ద ఏర్పాటుచేసిన ఫ్లెక్సీకి అడ్డుగా వైసీపీ నేతలు మరో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారని వేగుళ్ల వివరించారు. ఈవిషయంపై ప్రశ్నించిన భాస్కరరావును గ్రామఉపసర్పంచ్, మరికొందరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారని, తన భర్తపై దాడిని ప్రశ్నించిన అతడి భార్య వీర దుర్గా భవానీని అసభ్యపదజాలంతో దూషించారని అన్నారు. భాస్కరరావు ఆసుపత్రిలో చేరగా దుర్గాభవానీ దాడి ఘటనపై ఫిర్యాదు చేసేందుకు శుక్రవారం రాయవరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లితే ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 5గంటల పాటు ఫిర్యాదు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఈవిషయంపై బాధితురాలు దిశకు ఫిర్యాదు చేయగా దిశకు ఎందుకు ఫిర్యాదు చేశారని, భయపడే నాయకులు రాజకీయాలు ఎందుకంటూ టీడీపీ నాయకుల పట్ల వ్యంగ్యంగా ఎస్ఐ మాట్లాడటం ఎంతవరకు సమంజసమన్నారు. బాధితురాలితో పాటు ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వచ్చిన టీడీపీ నాయకుడు మేడపాటి రవీంద్రారెడ్డిని అంతుచూస్తానని ఎస్ఐ బెదిరింపులకు పాల్పడ్డారని, రవీంద్రారెడ్డికి ఏం జరిగినా ఎస్ఐ బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు.

హాస్టల్ సందర్శన

అంబాజీపేట, జనవరి 5: గంగలకుర్రు సమీకృత సంక్షేమ బాలుర వసతి గృహంలో ఏడాదిగా రక్షిత తాగునీటి వాటర్ ప్లాంట్ పనిచేయ పోవడంతో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందడంలేదని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కా సునీల్‌రాజు ఆరోపించారు. స్థానిక హాస్టల్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. బ్రాత్‌రూమ్ డోర్స్ లేవన్నారు. చలికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. టీడీపీ విద్యార్థి విభాగం తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు ప్రభాకర్, నాగేంద్ర, రాము, ప్రసాద్ పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి




అమలాపురంలో కళ్లకు గంతలు కట్టుకుని మున్సిపల్ కార్మికుల నిరసన, ముమ్మిడివరం:నిత్యావసర వస్తువులతో నిరసన తెలుపుతున్న అవుట్ సోర్సింగ్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు

అమలాపురం టౌన్, జనవరి 5: సమాన పనికి సమాన వేతనం చెల్లించడంతో పాటు కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తామని సీఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండు చేస్తూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం పదో రోజుకు చేరుకుంది. అమలాపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరం నిర్వహించారు. ప్రభుత్వానికి కనువిప్పుకలిగించాలని కోరుతూ పారిశుధ్య కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. పారిశుధ్య కార్మికులు ప్రాణాలకు తెగించి ఆరోగ్యాన్ని పణంగా పెట్టి ఉద్యోగాలు చేస్తున్నా ప్రభుత్వం కనికరించకపోవడం శోచనీయమని జేఏసీ నాయకులు నిమ్మకాయల శ్రీనివాసరావు, తొమ్మండ్రు గోపి పేర్కొన్నారు. దీక్షలో నాయకులు కొప్పుల బాబి, బండారు బాలకృష్ణ, చిన్ని, కానేటి వెంకట్రావు, రాయుడు సుబ్బలక్ష్మి, ఎం.మంగాయమ్మ, జయరా మాయమ్మ, ఎం.రమణ, పి.సాయమ్మ, సీఐటీయూ నాయ కులు పి.కోటేష్, ఎస్.మూర్తి, ఎం.రాంబాబు, ఎ.ప్రసాద్, జి.వర లక్ష్మి, బి.తలుపులమ్మ, అనంతలక్ష్మి, సీలావతి, సుశీల పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచా యతీ అవుట్ సోర్సింగ్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి11వ రోజుకు చేరుకుంది. నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన శిబిరం వద్ద అవుట్ సోర్సింగ్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు నిత్యావసర వస్తువులను చేతబట్టి నిరసన తెలి పారు. చాలీచాలని జీతాలతో పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో బతికేదెలా అంటూ వారు నినాదాలు చేశారు. డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటం సాగిస్తామన్నారు. సీఐటీయూసీ జిల్లా కార్యదర్శి గుడే దుర్గాప్రసాద్, ఏఐటీ యూసీ నాయకులు వనచర్ల విజయ్‌కుమార్, పలివెల రాంబాబు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. దీక్షాశిబిరంలో ఎం.శ్రీనివాసరావు, ఎస్.అరుణ్‌కుమార్, వి.వెంకటేశ్వర్లు, ఎస్.వెంకటేష్, కాకి రాంబాబు, జి.లోవరాజు, ఎం.భార్గవ్, అప్పన్న, నాగలక్ష్మి, వెంకటలక్ష్మి, జి.శ్రీను, కె.శరత్, ఎస్.రామరాజు, సీహెచ్ వెంకటేశ్వరరావు, లక్ష్మి, అర్జావతి, బి.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మండపేట: కోర్కెలు తీర్చాలంటూ మున్సిపల్ ఒప్పంద పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం 12వ రోజుకు చేరింది. ప్రభుత్వ నిరంకుశత్వ వైఖరిని కార్మికులు దుయ్యబట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కోర్కెలు తీర్చాలంటూ కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

రామచంద్రపురం: మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె శుక్రవారం జరిగింది. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద దీక్షా శిబిరాన్ని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ సలహాదారుడు వడ్డాది రాజు, ఆర్టీసీ యునైటెడ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి.ఎస్.నారాయణ, సీపీఐ నాయకులు పెద్దిరెడ్డి రాము, ప్రారంభించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రెడ్డి సుబ్రహ్మణ్యం దీక్షా శిబిరానికి చేరుకుని మద్దతు ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వ పతనం ఖాయమని, టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తారని అన్నారు. దీక్షలో మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగుల నాయకులు మీసాల గోపి, వడ్డాది సతీష్‌కుమార్, ఎన్.వి.వి.సత్యనారాయణ, ఎం.శ్రీను, బండి నారాయణ పాల్గొన్నారు.

రవికుమార్ పూజలు

అంతర్వేది, జనవరి 5: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామిని తెలుగుదేశం పార్టీ జోన్-2 పరిశీలకుడు మందలపు రవికుమార్ శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఘన స్వాగతం పలికారు. వేద పండితులు మహదాశీర్వచనం అందించారు

ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించండి

అమలాపురం టౌన్, జనవరి 5: ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించవలసిన ప్రభుత్వమే అందుకు విరుద్ధంగా చట్టాలు చేయడం శోచనీయమని జనసేన అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి డీఎంఆర్ శేఖర్ పేర్కొన్నారు. భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండు చేస్తూ న్యాయవాదులు అమలాపురం కోర్టు ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 16వరోజుకు చేరుకుంది. జీఎస్‌నాయుడు, ఏవీఎస్‌ప్రసాద్, ఎన్‌సీహెచ్ వెంకటేశ్వరరావు, పర్వతం సూర్యప్రకాశరావు(చిట్టిబాబు), పి.రాంప్రసాద్, ఎం.ఎం.జీ, ఎ.భవానీ, ఎన్.మల్లికార్జునరావు, ఎ.శ్రీనివాస్, వి.రాజశేఖర్, ఎం.అచ్యుత్, బడుగు భాస్కరజోగేష్, వెంపరాల భాస్కరశాస్త్రి, పట్టాభి, కేసీహెచ్ నానాజీ, మట్టపర్తి మురళీకృష్ణ, పినిపే రాధాకృష్ణ దీక్షలో పాల్గొ న్నారు. శిబిరాన్ని జనసేన నాయకుడు డీఎంఆర్ శేఖర్, నల్లా శ్రీధర్, లిం గోలు పండు, యాళ్ల నాగసతీష్, కంచిపల్లి అబ్బులు, ఆర్డీఎస్ ప్రసాద్, నల్లా వెంకటేశ్వర రావు, మోటుపల్లి సూర్యకిరణ్ సందర్శించి సంఘీభావం తెలిపారు.

12,259 ఆరోగ్యశ్రీ కార్డుల మంజూరు

అల్లవరం, జనవరి5: మండలంలోని 21సచివాలయాలకు12,259 ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డులు మంజూరయ్యాయని ఎంపీడీవో కృష్ణమోహన్ శుక్రవారం తెలిపారు. కోడూరుపాడు సచివాలయానికి 800కార్డులు అందజేశారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, ఆడుదాం ఆంధ్రా, అంగన్‌వాడీ కేంద్రాల తీరుపై సమీక్షించారు. ఏవో బి.లక్ష్మణరావు, ఈవోపీఆర్డీ ఎన్వీవీ సత్యనారాయణ, ఏఈలు జి.సంపన్, ఎం.సుబ్బారావు, ఎంఈవో2 ఏడుకొండలు పాల్గొన్నారు.

అన్నివర్గాల శ్రేయస్సు కోసమే యాత్ర

మామిడికుదురు, జనవరి 5: అన్నివర్గాల, ప్రాంతాల శ్రేయస్సు కోసమే ఐక్యతా విజయపథం పాదయాత్ర చేస్తున్నట్టు విశ్రాంత ఐఏఎస్ అధికారి జీఎస్ఆర్కేఆర్ విజయ్‌కుమార్ తెలిపారు. ఐక్యతా విజయపథం పాదయాత్ర శుక్రవారం మామిడికుదురు చేరుకుంది. నెల్లూరు నుంచి మొదలైన యాత్ర ఇప్పటివరకు 2వేల కిలోమీటర్లు నడిచి గ్రామాల్లో పేదల సమస్యలు తెలుసుకుంటున్నట్టు తెలిపారు. గ్రామంలో పలువురు సంఘీభావం తెలిపి పాదయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, పీఏసీఎస్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్యకుమార్, కోఆప్షన్ సభ్యుడు నూరేస్‌అబ్బాస్, ఓఎన్జీసీ ఉద్యోగి సాపే రెడ్డి, కలిగితి పల్లంరాజు, నయినాల వేణుగోపాల్, నయినాల రామకృష్ణ, నయినాల కాశీవిశ్వనాథ్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

అయినవిల్లి, జనవరి 5: కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా పేర్కొన్నారు. పొట్టిలంకలో సర్పంచ్ కోనే సునీత సుబ్బలక్ష్మి అధ్య క్షతన శుక్రవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఎంపీపీ మట్ట పర్తి నాగవిజయలక్ష్మి, ఎంపీడీవో తాడి వెంకటాచార్య, ఈవోపీఆర్డీ మోహనకృష్ణ, గనిశెట్టి వెంకటేశ్వరరావు, బీజేపీ పి.గన్నవరం కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు, డాక్టర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: రామరాజులంక, శంకరగుప్తం, అడివిపాలెం గ్రామాల్లో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జరిగింది. యాత్రలో బీజేపీ అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు నిరుపేదలకు అందిస్తుందన్నారు.అడబాల సత్యనారాయణ, ఎంపీపీ ఎంపీ.సత్యవాణి, అడబాల రాంబాబు, కాపిశెట్టి కనకేశ్వరరావు పాల్గొన్నారు.

సూర్యప్రకాష్ విజయానికి కృషి చేస్తా: మల్లాడి

రామచంద్రపురం, జనవరి 5: వైసీపీ రామచంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ విజయానికి కృషి చేస్తానని యానానికి చెందిన మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు అన్నారు. స్థానిక ఎంపీ బోస్ కార్యాలయంలో శుక్రవారం బోస్, ఆయనతనయుడు సూర్యప్రకాష్‌ను మల్లాడి మర్యాదపూర్వకంగా కలిశారు. బోస్‌కు, తనకు సుదీర్ఘ కాల స్నేహం ఉందని మల్లాడి అన్నారు. మల్లాడి మమ్మల్ని కలవడానికి రావడం మా అదృష్టమని బోస్ అన్నారు.

కొత్త పింఛన్లు పంపిణీ

రావులపాలెం, జనవరి 5: రావులపాలెంలోని పోతంశెట్టి రామిరెడ్డి పార్కు వద్ద జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డులు పంపిణీ చేశారు. నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: అంగర శ్రీవైభవ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గ్రామసర్పంచ్ వాసా కోటేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వైఎస్ఆర్ నూతన పెన్షన్లు పంపిణీ చేశారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు, జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఆర్‌బీకె సలహాకమిటీ చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, పడమరఖండ్రిక గ్రామసర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రెండు మోటార్‌సైకిళ్లు ఢీ: వ్యక్తి మృతి

మలికిపురం, జనవరి 5: మట్టేలంకలో శుక్రవారం రెండు మోటార్‌సైకిళ్లు ఢీకొనడంతో తోట విజయఅర్జున్(60) మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: హాయ్ నాన్న
వెంకటరమణ	: కపాలదీవి
శ్రీలలిత	: యానిమల్
శేఖర్ స్క్రీన్-1	: రాఘవరెడ్డి
శేఖర్ స్క్రీన్-2	: ఆక్వామెన్
రమా	: డెవిల్
గణపతి	: ఎక్స్‌ట్రార్డనరీ
వెంకటపద్మావతిస్క్రీన్-1	: సలార్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: సలార్

నేడు యానాం రానున్న ప్రముఖులు

యానాం, జనవరి 5: ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అధ్యక్షతన శనివారం నుంచి మూడు రోజులు జరగనున్న 20వ ప్రజాఉత్సవాలు, 22వ ఫలపుష్ప ప్రదర్శనలకు పుదుచ్చేరి మంత్రులు యానాం రానున్నారు. ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి తన కార్యాలయంలో వివిధశాఖల అధికారు లతో ఏర్పాట్లపై సమీక్షించారు. ప్రభుత్వ అతిథి గృహంలో గదుల పరిస్థితిని తనిఖీ చేశారు. ముఖ్యఅతిథులుగా పుదుచ్చేరి పర్యాటకశాఖ మంత్రి కె.లక్ష్మీనారాయణ, ప్రభుత్వఢిల్లీ ప్రత్యేకప్రతినిధి మల్లాడి కృష్ణారావు, పర్యాటకశాఖ డైరెక్టర్ మురళీధరన్ తదితరులు హాజరుకానున్నారు. సోమవారం ముగింపు రోజున సీఎం ఎన్.రంగసామి, స్పీకర్ సెల్వమ్, వ్యవసాయ శాఖ మంత్రి జయకుమార్ హాజరుకానున్నారు.

తాగునీరు అందించండి

అమలాపురం రూరల్, జనవరి 5: బండారులంక శివారు దంగేటివారిపాలెంలో తరతరాలుగా 150ఏళ్లకు పైనుంచి జీవిస్తున్నామని, ఇంతవరకు తమకు తాగునీటి సదుపాయం కల్పించలేదని, డ్రైనేజీ సదుపాయం లేక రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ మహిళలు, పిల్లలతో కలిసి శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. దంగేటివారి పాలెంలో 200కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, కనీస మౌలిక సదు పాయాలు కల్పించాలని అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకున్నా ఎవరు పట్టించుకోవట్లేదని వాపోయారు. తాగునీరు, డ్రైనేజీ సదుపాయాలు కల్పించ కపోయినా ఏటా పంచాయతీకి పన్నులు చెల్లిస్తున్నామన్నారు. స్పందనలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ధర్నా అనంతరం జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్‌ను కలిసి వినతిపత్రం అందించారు.